# కొత్త నాన్న

ఆ హరిజనవాడ అలవైకుంఠంబున... అన్నట్టు లేదు. పచ్చని పొలం పక్కన ఓ రాళ్ళ గుట్ట పడివున్నట్టుంది. పూరి గుడిసెలు దగ్గర దగ్గరగా బ్రహ్మజెముడు డొంకల్లా వున్నాయి. గుడిసెల్లోని మనుషులు వెలుగుతున్న దీపాల్లాగా వున్నారు. మలుగుతున్న దీపాల్లాగ వున్నారు.

"ఒరే జగ్గన్నా. సామాన్లన్నీ కొన్నట్టేనా" అన్నాడు క్రిష్ణయ్య.

"అన్నీ కొని తెచ్చాం నాన్నా"

"మళ్ళీ ఇంకోపాలి అన్నీ వున్నయ్యో నేదో సూడు"

"చూశాను. బట్టలు మాత్రం సరిపడా కొనలేదు. ఇంక డబ్బు లేదన్నావుగా మరి" అన్నాడు జగ్గారావు.

"రెక్కలు ముక్కలు సేసుకుంటే కానీ, డొక్కాడనోళ్ళం ఈమాత్రం కరుసు పెట్టడమే మనకి గొప్ప" అన్నాడు క్రిష్ణయ్య చద్దన్నం ముగించి లేస్తూ.

జగ్గారావు విని వూరుకున్నాడు.

"మన సూరన్నా, సెంద్రవూ రేపే గందా వత్తామని రాసేరు"

"అవును" అన్నట్టు తలూపాడు జగ్గారావు.

"రేపు సేపలు తెచ్చి పులుసొండవే" అన్నాడు క్రిష్ణయ్య గుడిసెలోంచి వొంగుని బయటికొస్తూ.

"అట్టాగేలేవయ్యా" అన్న భార్య మాట వినిపించింది.

"కిట్టయ్యా, పెళ్ళిపన్లు అయినట్టేనా"

"అవుతున్నాయి తాతా. పన్లోకేనా"

"సినకాపుగోరి పన్లోకి" అని నెమ్మదిగా అడుగులేస్తూ వంగిన నడుంతో ముందుకెళ్ళాడు తాత.

"సెట్టంత కొడుకు మావిడి సెట్టు కొడుతూ అది మీద పడి సచ్చిపోనాడు. ఆడేవుంటే తాతకీ వయసులో పన్నోకెళ్ళాల్సుండేది కాదుగందా" అనుకుని, నిట్టూర్చి పొలంలోకెళ్ళాడు క్రిష్ణయ్య.

కొడవలి తీసుకుని కోత పనిలో పడ్డాడు క్రిష్ణయ్య మిగతావాళ్ళ పక్కన వొంగుని.

"నాన్నా, ఈ రెండ్రోజులూ పనిమానెయ్యంటే మానేవుకాదు" అన్నాడు సాంబడు కోసిన ఎన్నెలు పనగా పెడుతూ.

"ఒరే సాంబా. రేప్పెళ్ళెట్టుకుని నువ్వు మాత్రం మానేవేంటిరా. ఏ రోజు పని మానితే ఆ రోజు పస్తులుండాలని నీకూ తెల్సు, నాకూ తెల్సు. మన్లాంటోళ్ళ పేమలూ, అభిమానాలూ మాటలవరకేరా"

